ఆసుపత్రులకు సూపరింటెండెంట్స్ నియామకం


డాక్టర్ అనిత రాయిరాల


డాక్టర్ ఎం. శ్రావణ్‌కుమార్

వెంగళరావునగర్: ఎర్రగడ్డలోని మెంటల్, ఛాతీ ఆసుపత్రులకు పూర్తిస్థాయి సూపరింటెండెంట్స్‌ను ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈ ఆసుపత్రులో ఇన్‌చార్జీలుగా ఉన్న వైద్యులు ఆదివారం నుంచి పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా మెంటల్ హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ అనిత రాయిరాల 2004లో ఉస్మానియాలో పీజీ చేసి 2018లో మెంటల్ హాస్పిటల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2021 నుంచి ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకున్నారు. కాగా డాక్టర్ శ్రావణ్‌కుమార్ 1980 ఉస్మానియాలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అక్కడే ఎండీ పూర్తి చేశారు. 2012 వరంగల్ చెస్ట్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఇటీవల ఎర్రగడ్డ ఛాతీ ఆసుపత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చారు. కాగా ఇరువురు (మెంటల్, చెస్ట్ హాస్పిటల్స్) వైద్యులకు ప్రభుత్వం పూర్తిస్థాయి సూపరింటెండెంట్స్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

మురుగునీటి రహిత నగరం కోసం..

చిత్తశుద్ధితో పనిచేయండి

- ప్రతీ మ్యాన్‌హోల్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి
- 2 నుంచి 90 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమం
- పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవు
- పనుల నిర్వహణతో పాటు భద్రతపై కూడా దృష్టి పెట్టాలి
- సమావేశంలో జీఎం హరి శంకర్

బంజారాహిల్స్: మురుగు నీటి రహిత నగరంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా జలమండలి సిబ్బంది, ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలని జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని జలమండలి కార్యాలయంలో డివిజన్–6లోని 13 సెక్షన్లకు చెందిన డీజీఎంలు, మేనేజర్లు, ఎయిర్‌టెక్ ఓనర్లు, సూపర్‌వైజర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మురుగు నీటి నిర్వహణ– భద్రతపై అవగాహనతో పాటు ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి చేపట్టబోయే ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులకంటే సిబ్బందికే అన్ని విషయాలు తెలుసునని ఎక్కడెక్కడ మ్యాన్‌హోళ్ళు ఓవర్ ఫ్లో అవుతున్నాయో, ఎందుకు అవుతున్నాయో కారణాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతీ మురుగు నీటి కాల్వను శుభ్రం చేయాలని ఒక్కో బస్తీ పరిధిలో, కాలనీల్లో, ప్రధాన రహదారుల్లో ఎన్ని మీటర్ల మేర మురుగు కాల్వలు ఉన్నాయి, వాటి విస్తీర్ణం ఎంత, ఎక్కడెక్కడ డ్యామేజీలు ఉన్నాయో, ఎక్కడెక్కడ ఓవర్ ఫ్లో అవుతున్నాయో, వ్యర్థాలు ఎక్కువగా ఎక్కడ ఇరుక్కుంటాన్నాయో గుర్తించి సర్వే చేయాలన్నారు. ఎయిర్‌టెక్ మిషన్ ఓనర్లు బాధ్యతగా విధులు నిర్వహించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మేనేజర్లు సైతం అక్టోబర్ 2 నుంచి 90 రోజులపాటు ఏ రోజు ఏ బస్తీలో పనిచేయాలో, ఏ కాలనీలో పనిచేయాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సీవరేజీ లైన్లు, మ్యాన్‌హోళ్లలో పనులు చేసేటప్పుడు సిబ్బంది ఖచ్చితంగా రక్షణ ప్రొటోకాల్ పాటించాలని ఎవరైతే రక్షణ ప్రొటోకాల్‌లోని గ్లౌజ్‌లు, మాస్కులు, షూస్ వేసుకోరో ఆ సిబ్బందితో పాటు సంబంధిత అధికారులపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదే విధంగా మ్యాన్‌హోళ్ల, లైన్లు మరమ్మతులు చేసే సమయంలో స్థానికులు, వాహనదారులను, పాదచారులను అప్రమత్తం చేసే విధంగా సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా దీర్ఘకాలిక సమస్యలు ఉంటే మరమ్మతులతో పనులు జరగకపోతే సంబంధిత మేనేజర్లు ప్రణాళికలు రూపొందించి తన వద్దకు పంపిస్తే నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తామని సూచించారు.


మాట్లాడుతున్న జలమండలి జీఎం హరి శంకర్


పాల్గొన్న సిబ్బంది, ఉద్యోగులు

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


శునకాలకు ఉచిత రేబిస్ టీకా ఇస్తున్న వైద్యులు

బంజారాహిల్స్: పెంపుడు జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ ఆత్మీయంగా ఉంటూ, వాటి ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ అన్నారు. నారాయణగూడ ఎస్ఎస్‌వీహెచ్‌లో వరల్డ్ రేబిస్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు సోకే వ్యాధులపై అవగాహన ఉండాలని సూచించారు. ఏదైనా జబ్బు చేసిన వెంటనే దగ్గరలోని జంతు వైద్యులను సంప్రదించాలన్నారు. అలాగే రేబీస్ టీకాలను తప్పనిసరిగా పెంపుడు శునకాలకు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 100 శునకాలకు ఉచిత రేబిస్ టీకాలు వేశారు. ఎస్ఎస్‌వీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అరవింద్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మాటను నిలబెట్టుకోవాలి


ఆత్మీయ సమ్మేళనంలో బీసీ కుల సంఘాల ప్రతినిధులు ..

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ తక్షణమే కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానికసంస్థల ఎన్నికలకు వెళ్లి ఇచ్చినమాటను నిలుపుకోవాలని బీసీ కమిషన్ మాజీ సభ్యులు సీహెచ్. ఉపేందర్ అన్నారు. బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపేందర్ మాట్లాడుతూ తమిళనాడులో ఏవిధంగా బీసీ ఉద్యమం జరిగిందో అదే ఉద్యమస్ఫూర్తితో తెలంగాణలో బీసీలు ముందుకు రావాలని, బీసీలకు రాజ్యాధికారం రావాలంటే స్థానిక సంస్థల్లో అత్యధిక సీట్లు బీసీలు గెలుపొందాలని పిలుపునిచ్చారు. బంగారు నరసింహ సాగర్ మాట్లాడుతూ బీసీలలో అందరం ఒకరి కులం మరొకరు గౌరవించుకుని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ చిన్న కులాలను సమాజానికి పరిచయం చెయ్యడమే లక్ష్యంగా బీసీ సమాజ్ బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్‌సాగర్, ఓర్సు కృష్ణయ్య, సత్యనారాయణ రాజు, ఎత్తరి అంతయ్య, దేవేందర్, వెంకటేశ్, శివాని తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను కేటాయించే వరకు పోరాటం చేస్తాం

- కమలానగర్ బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హైదర్


మాట్లాడుతున్న హైదర్

రహమత్‌నగర్: కమలానగర్ బెడ్‌రూంలలో తమకు ఇళ్లను ఇచ్చిన తరువాతే మిగిలినవి ఎవరికైనా కేటాయించుకోవాలని బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హైదర్ స్పష్టం చేశారు. తమకు నివాసాలను కేటాయించే వరకు తాము న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమలానగర్ బస్తీలో 56 మంది స్థానికులు తమ ఇళ్లను కోల్పోయారని వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర హైకోర్టులో తొమ్మిది సంవత్సరాల క్రితమే పిటిషన్ వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేసు న్యాయస్థాన పరిధిలో ఉందన్నారు. ఈ విషయమై హైద్రాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు హైద్రాబాద్ జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓలకు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో చాలా అవకతవకలు జరుగాయని ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. స్పందించిన సీఎం కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచారణ నిమిత్తం పంపించడం జరిగిందన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో విజయ్, పరంధాములు, ఖలీల్, ఇబ్రహీం, బుచ్చయ్య, లలిత, పర్వీన్, హుస్సేన్, ఖైరున్, జయరాం, శివమ్మలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి గ్రాండ్ పేరెంట్స్ వెన్నెముక

- ఎస్ఎస్ఎస్‌వీలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలు


అమ్మమ్మ, నాయనమ్మలతో ఆటలాడుతున్న చిన్నారులు

వెంగళరావునగర్: కుటుంబానికి వెన్నెముక గ్రాండ్ పేరెంట్స్ అని, మన జీవితంలో వారి పాత్ర ఎంతో గొప్పదని సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్ చైర్మన్ శిరీషభవానీశంకర్ అన్నారు. ఆదివారం శ్రీకృష్ణానగర్‌లోని సాయి సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రీప్రైమరీ చిన్నారుల అమ్మమ్మలు, నాయనమ్మలు పాల్గొన్నారు. చిన్నారులు తమ చిట్టిపొట్టి మాటలతో విలువను, ప్రాధాన్యతను తెలియజేశారు. అదేవిధంగా బుడిబుడి అడుగులతో వారితో కలిసి నాట్యం చేసి అందరినీ అలరించారు. ఈ సందర్భంగా శిరీష భవానీశంకర్ మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే తాతయ్య, అమ్మమ్మ, నాయనమ్మల ప్రాముఖ్యతను వారి తల్లిదండ్రులు తెలియజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ


రమేశ్ నాయక్‌కు పరామర్శిస్తున్న డా.కళ్యాణ్ నాయక్

రహమత్‌నగర్ (బోరబండ): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బీజేపీ ఎస్టీ మోర్చా కార్యాలయ కార్యదర్శి, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బర్మావత్ రమేశ్ నాయక్‌ను రాష్ట్ర బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డా. కళ్యాణ్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా రమేశ్‌నాయక్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బీజేపీ నాయకురాలు జ్యోతినాయక్, బీజేవైఎం నాయకుడు భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్ సీపీఎం శాఖ కార్యదర్శిగా స్వామి


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, స్వామిలు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ సీపీఎం శాఖ కార్యదర్శిగా స్వామి ఎన్నికైయ్యారు. ఎస్ఎస్‌బీనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సీపీఎం పక్షాన ప్రజల తరుపున పోరాటం చేస్తానని చెప్పారు. సీపీఎం నాయకులు అశోక్, శేషగిరిరావు, భాగ్యరాజ్, లక్ష్మణ్, దేవదాస్, ఏఆర్ నరసింహ, రాము, పార్వతమ్మ, సువర్ణ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

జంక్షన్లకు కొత్త అందాలు


నాగార్జున సర్కిల్‌లో ఏర్పాటు చేసిన నమూనా

బంజారాహిల్స్: జంక్షన్ల సుందరీకరణతో పాటు ముఖ్యమైన కూడళ్ళలో అధికారులు ఏర్పాటు చేస్తున్న నమూనాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నాగార్జున సర్కిల్‌లో ఇద్దరు విద్యార్థులు చదువుకుంటున్నట్లు ఉన్న నమూనాను ఆదివారం అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నమూనాతో ఈ జంక్షన్‌కే సరికొత్త అందమొచ్చింది. రానున్న రోజుల్లో మరిన్ని విభిన్నమైన నమూనాలు ఆయా కూడళ్ళలో కనిపిస్తాయని ఖైరతాబాద్ డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



రహమత్‌నగర్ (బోరబండ): ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కానిస్టేబుల్ సాయికుమార్ కుటుంబ సభ్యులకు బోరబండ పోలీస్ సిబ్బంది ఆదివారం రూ. లక్ష వేయి రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ మాట్లాడుతూ సాయికుమార్ మృతి పోలీసు శాఖను తీరనిలోటని వాపోయారు. సెక్టార్ ఎస్సైలు సర్దార్ జమాల్, మహేష్, తుల్జారంనాయక్, స్వప్నారెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యం

- బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆత్మకూరి రామారావు స్కూల్ ప్రతినిధులు

ఫిలింనగర్: విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యమని ఆత్మకూరి రామారావు స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయక్ అన్నారు. భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌కు 'డైనమిక్ స్కూల్–2024' అవార్డు దక్కింది. ఎడ్యుకేషనల్ న్యూస్ నెట్‌వర్క్ (ఈఎన్ఎన్) ఆధ్వర్యంలో ఇటీవల నగరంలో జరిగిన డైనమిక్ స్కూల్ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్, స్కూల్ కో–ఆర్డినేటర్ సంయుక్తరావులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందిస్తేనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. కమ్యూనిటీ బెస్ట్ యాక్టివిటీస్, అన్ని వసతులు, సౌకర్యాలు, ఎక్స్‌లెంట్ అకాడమిక్, పర్యావరణ పరిరక్షణ, సిటిజన్ ప్రోగ్రాం తదితర కార్యక్రమాలు నిత్యం జరుపుతున్నట్లు చెప్పారు.

కేఎల్ డీమ్డ్ టు బీ వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు


అంతర్జాతీయ సదస్సుకు హాజరైన వక్తలు, విద్యార్థులు

బంజారాహిల్స్: ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఓజోన్, పర్యావరణంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. బీహార్‌కు చెందిన ఏక్విటాస్ విక్టోరియా రీసెర్చ్ సెంటర్ (ఏవీఆర్‌సీ సహకారంతో జరిగిన ఈ సదస్సులో 'మెరుగైన పర్యావరణం కోసం మానవజన్య కార్యకలాపాలను పునర్నిర్మించడం ఒక వైవిధ్యమైన విధానం' అనే అంశంపై వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ పార్థసారధి వర్మ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, స్థిరమైన పట్టణ ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణలో 'కార్పొరేట్' బాధ్యత వంటి అంశాలను ఈ సదస్సులో ప్రస్తావిస్తూ ఎంతోమంది పరిశోధనా పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. ఇటీవల విజయవాడలో తలెత్తిన వరదలతో పాటు కోస్తాంధ్రాలో వరద సమస్యను పరిష్కరించేలా నివేదికను సిద్ధం చేయడం ఈ సదస్సు ముఖ్య అంశాలలో ఒకటి అన్నారు. సమీక్ష కోసం ఆంధ్రప్రదేశ్ పర్యావరణ మంత్రిత్వ శాఖకు ఈ నివేదికను సమర్పించనున్నట్లు చెప్పారు.

ప్రజా సంక్షేమం ఆమ్ ఆద్మీతోనే సాధ్యం

లిబర్టీ: సామాన్య ప్రజల సంక్షేమమే తమ పార్టీ లక్ష్యమని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్ ఖలీమ్‌బాబా, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ షా, ఎండీ రహీం అక్బర్ నూర్ అన్వర్, మజీద్, అత్తార్ తదితరులు లిబర్టీ వద్ద ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేద ప్రజల అభ్యున్నతి విద్యా, వైద్యం, మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర రాములుగౌడ్, సలమన్‌రాజు, మాజీద్, అప్సరజావిద్, షరీఫ్, దర్శనం, రమేష్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు కృషి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: అర్హులైన లబ్ధిదారులందరికీ డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి హామీ ఇచ్చారు. కమలానగర్ డబుల్‌బెడ్‌రూం నివాసాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూం రాలేదని ఆందోళన చెందుతున్నారని అధైర్యపడవద్దని సూచించారు. త్వరలోనే జిల్లా కలెక్టర్‌కు కలిసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్యాషియర్‌పై సిబ్బంది దాడి

వెంగళరావునగర్: క్యాషియర్‌పై సిబ్బంది దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. విజయనగరం ప్రాంతానికి చెందిన ఎం.కిరణ్ అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనితో పాటుగా విధులు నిర్వహించే సందీప్, సూరజ్‌లు శనివారం సాయంత్రం తప్పుగా ఆర్డర్లు ఇచ్చారు. ఇదేమని కిరణ్ వారిని ప్రశ్నించగా దాడికి పాల్పడ్డారు. బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఈజీ మనీ కోసం గంజాయి విక్రయం

- ఎన్బీటీనగర్‌లో గంజాయి బ్యాచ్ అరెస్టు


పోలీసులు అరెస్ట్ చేసిన గంజాయి బ్యాచ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌రోడ్‌నెం. 12లోని ఎన్బీటీనగర్ కమాన్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో గంజాయి అమ్ముతుండగా బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి గంజాయి విక్రేతలతో పాటు కొనుగోలుదారులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... ఎన్బీటీనగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకున్న నితీష్‌కుమార్ (24) తన స్నేహితులతో కలిసి ఈజీమనీ కోసం గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ కె.రమేష్ సిబ్బందితో కలిసి శనివారం రాత్రి ఈ గదిపై దాడి చేశాడు. సోదాల్లో పెద్ద ఎత్తున గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నితీష్ కుమార్‌తోపాటు కన్హయ్యకుమార్, అనిల్‌కుమార్‌లు గంజాయి విక్రయిస్తున్నట్లుగా తేలింది. వీరంతా బీహార్ ముజఫర్‌పూర్‌కు చెందిన వారుగా గుర్తించారు. వీరి నుంచి బీహార్‌కు చెందిన పంకజ్‌కుమార్, రాకేష్ కుమార్, లలిత్‌పాశ్వాన్, దీపక్‌కుమార్, కరణ్‌కుమార్ తదితరులు గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు తేలింది. వీరందరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నలుగురు గంజాయి విక్రేతలతో పాటు అయిదు మంది కొనుగోలు దారులు పట్టుబడ్డట్లు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్‌నగర్‌లో మన్‌కీబాత్ వీక్షణ

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బూత్ నెంబర్–186లో ఆదివారం ప్రధాన మంత్రి మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. బీజేపీ బూత్ అధ్యక్షుడు ఎస్.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, బూత్ కో–ఆర్డినేటర్ రాజారాం యాదవ్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి రోహిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నెక్లెస్ రోడ్డులో 'రెహాబ్ రన్'

ఖైరతాబాద్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం నెక్లెస్ రోడ్డులో కార్డియాక్ రెహాబ్ రన్ నిర్వహించారు. బ్రిటీష్ హై కమిషనర్ రేయిహ్ జెండా ఊపి ఈ రన్‌ను ప్రారంభించారు. సంజీవయ్య పార్కు నుంచి ప్రారంభమైన రన్ ట్యాంక్‌బండ్ చుట్టూ కొనసాగింది. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాయామం చేస్తే గుండె సంబంధిత సమస్యల బారిన పడకుండా ఉండవచ్చునని కార్డియాక్ రెహాబ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్, సీఈఓ డాక్టర్ మురళీధర్ బాబీ తెలిపారు. ప్రతి రోజూ 30 నిమిషాలు వాకింగ్ చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చునని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



2న చలో గాంధీభవన్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరణలో జేఏసీ నాయకులు

ఖైరతాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే జీవో 317 సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటి వరకు పరిష్కరించలేదని జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ అధ్యక్షులు విజయకుమార్ అన్నారు. అక్టోబర్ 2న చేపట్టే చలో గాంధీభవన్ కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం సాగర తీరంలో ఉన్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజు గాంధీభవన్‌లో గాంధీ సాక్షిగా జీవో 317 సమస్యను పరిష్కరిస్తామని చెప్పి సంవత్సరం పూర్తయిందన్నారు. అక్టోబర్ 2న గాంధీభవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి వెంటనే సమస్య పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతామన్నారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సబ్ కమిటీ ఏర్పాటు చేసి దాదాపు 8 నెలలు గడిచిందని వెంటనే జీవో 317 సబ్ కమిటీ రిపోర్టును ముఖ్యమంత్రికి సమర్పించాలని కోరుతామని తెలిపారు. సబ్ కమిటీ చైర్మన్ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే నిర్ణయం తీసుకొని దసరాలోపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలలో సంతోషాన్ని నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మధుసూధన్ రెడ్డి, నందీప్, వినోద్ సూరి, ప్రవీణ్, లత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

రహమత్‌నగర్ (బోరబండ): మంచం మీద నుంచి ఓ చిన్నారి ప్రమాదవశాత్తు కిందపడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎస్పీఆర్‌హిల్స్ ఆశయ్యనగర్‌కు చెందిన సురేష్ కూతురు హసిని (3) ఈ నెల 19న మధ్యాహ్నం తన సోదరితో కలిసి మంచంపై పడుకుంది. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు నిలోఫర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.